పక్క దేశాలపై ట్రంప్ కన్ను

- అమెరికాకు కెనడా 51వ రాష్ట్రమని ప్రకటన
- పనామా కెనాల్ తమ దేశానిదేనని వ్యాఖ్య
- గ్రీన్‌లాండ్‌ను తమకు ఇవ్వాలని డెన్మార్క్‌పై ఒత్తిడి
- సైనిక, ఆర్థిక చర్య ఉండదని చెప్పలేనని కామెంట్
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై ఫ్రాన్స్ తీవ్ర ఆగ్రహం

వాషింగ్టన్, జనవరి 8: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాల భూభాగాలపై కన్నేశారు. కెనడా, గ్రీన్‌లాండ్, పనామా కెనాల్ తమకేనంటూ ఆయన చేస్తున్న ప్రకటనలు వివాదాస్పదంగా మారాయి. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ట్రంప్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భేటీ అయ్యారు. అప్పటినుంచి కెనడాను అమెరికాకు 51వ రాష్ట్రంగా, ట్రూడోను గవర్నర్‌గా ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు. కెనడాను అమెరికాలో కలుపుకునేందుకు సైనిక చర్యకు దిగతారా అని ప్రశ్నించగా.. 'సైనిక చర్య ఉండదు. ఆర్థిక శక్తిని ప్రయోగిస్తాం. ఇరుదేశాల మధ్య కృత్రిమంగా గీసిన సరిహద్దు రేఖను వదిలించుకోవాలి. జాతీయ భద్రతకు ఇది చాలా మంచిది. మేము కెనడాను రక్షిస్తున్నాం. ఇందుకు వందల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాం. పైగా ఇరు దేశాల వాణిజ్యంలో ఏటా 200 బిలియన్ డాలర్లు నష్ట పోతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను జస్టిన్ ట్రూడోతో పాటు ప్రతిపక్ష నేతలు ఖండించారు. అమెరికాలో కెనడా ఎప్పటికీ భాగం కాబోదని, తమది గొప్ప స్వతంత్ర దేశమని స్పష్టం చేశారు. ట్రూడో ప్రకటనపై ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్ మండిపడ్డారు. 'బాలికా, ఇక నువ్వు కెనడా గవర్నర్‌వు కాదు. కాబట్టి నువ్వు ఏం చెప్పావనేది విషయం కాదు' అంటూ ట్రూడోను ఉద్దేశించి 'ఎక్స్'లో మస్క్ వ్యాఖ్యానించారు.

పనామా కెనాల్, గ్రీన్‌లాండ్ కూడా..

అట్లాంటిక్ - పసిఫిక్ సముద్రాల మధ్య రవాణాకు కీలకమైన పనామా కెనాల్‌పైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పనామా కెనాల్‌ను సైనిక అవసరాల కోసం నిర్మించారు. ఇది అమెరికాకు చాలా కీలకం. ఈ కెనాల్‌ను అమెరికా పనామాకు ఇచ్చింది. కానీ చైనా ఈ కెనాల్ నిర్వహణను తీసేసుకుంది. అమెరికా నౌకలకు పనామా చాలా ఎక్కువ చార్జీలు వేస్తున్నది. కెనాల్ అప్పగింత ఒప్పందాన్ని పనామా ఉల్లంఘించింది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారీగా సహజ వనరులతో, వ్యూహాత్మకంగా కీలకమైన మంచు ప్రదేశం గ్రీన్‌లాండ్‌పైనా ట్రంప్ కన్నుపడింది. తమ దేశ భద్రతా అవసరాల దృష్ట్యా గ్రీన్‌లాండ్ తమకు కావాలని ట్రంప్ అన్నారు. గ్రీన్‌లాండ్‌పై డెన్మార్క్‌కు న్యాయమైన హక్కు ఉందా లేదా అనేదీ ఎవరికీ తెలియదని, స్వేచ్ఛాయుత ప్రపంచం కోసం గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ తమకు వదిలేయాలని ట్రంప్ పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌లో చైనా, రష్యా నౌకలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కాగా, పనామా కెనాల్, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు సైనిక చర్యకు దిగతారా అని ప్రశ్నించగా దిగబోమని చెప్పేందుకు ట్రంప్ నిరాకరించారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చాలని అనుకుంటున్నట్టు సైతం ట్రంప్ ప్రకటించారు.

తీవ్రంగా స్పందించిన ఫ్రాన్స్

యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఫ్రాన్స్ తీవ్రంగా స్పందించింది. 'యూరోపియన్ యూనియన్ సార్వభౌమ సరిహద్దులపై దాడి చేసేందుకు, జోక్యం చేసుకునేందుకు ప్రపంచంలో ఏ దేశాన్నీ అనుమతించే ప్రసక్తే లేదు' అని ఫ్రాన్స్ విదేశాంగ శాఖ మంత్రి జెయన్ నోయల్ బారట్ బుధవారం పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా ఆక్రమిస్తుందని అనుకోవడం లేదని, ఇప్పుడు మనం బలంగా సమాధానం ఇచ్చే యుగంలో ఉన్నామని ఆయన పరోక్షంగా ట్రంప్‌ను హెచ్చరించారు.

ఇస్రో చైర్మన్‌గా నారాయణన్

జనవరి 14 నుంచి బాధ్యతల్లోకి..

బెంగళూరు, జనవరి 8: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తదుపరి చైర్మన్‌గా డాక్టర్ వీ నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్ ఎస్ సోమనాథ్ పదవీకాలం ముగియనుండటంతో జనవరి 14న నారాయణన్ బాధ్యతలు చేపట్టనున్నారు. నారాయణన్ సారథ్యంలో చంద్రయాన్-4, గగన్‌యాన్, శుక్రయాన్, మంగళ్‌యాన్-2, పునర్వినియోగ వాహకనౌక తయారీ వంటి కీలక ప్రాజెక్టులను ఇస్రో చేపట్టనుంది. 1984లో శాస్త్రవేత్తగా ఇస్రోలో చేరిన నారాయణన్ నాలుగు దశాబ్దాలుగా అనేక కీలక ప్రాజెక్టుల్లో భాగస్వాములయ్యారు. ఆయన నాయకత్వంలో పీఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ సహా అనేక ఇస్రో ప్రయోగాలకు ఎల్‌పీఎస్‌సీ 183 లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్‌లు, కంట్రోల్ పవర్ ప్లాంట్లను అందించింది. చంద్రయాన్-2, చంద్రయాన్-3, ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ ప్రయోగాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. జీఎస్‌ఎల్‌వీ ఎంకే III వాహక నౌకకు సంబంధించిన సీ25 క్రయోజెనిక్ ప్రాజెక్టుకు ఆయన ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు.

బందీలను విడిచిపెట్టకపోతే అంతు చూస్తా

హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జూన్ 8: తాను అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే బందీలందరినీ హమాస్ విడుదల చేయని పక్షంలో పశ్చిమాసియాలో అల్లకల్లోలం సృష్టిస్తామని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. బుధవారం ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగోలో విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ జనవరి 20న అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టడానికి ముందుగానే బందీలందరూ వాపసు రాని పక్షంలో హమాస్ అంతుచూస్తానని హెచ్చరించారు. కొందరు అమెరికన్ పౌరులతోసహా దాదాపు 100 మందిని 2023 అక్టోబర్ 7 హమాస్ బందీలుగా చేసుకుంది. గాజాలో అప్పటి నుంచి బందీలుగా ఉన్న వీరిలో చాలా మంది మరణించి ఉండవచ్చని అమెరికా అధికారులు భావిస్తున్నారు. జనవరి 20లోగా బందీలు అందరినీ హమాస్ విడుదల చేయాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు.

లాస్ ఏంజెల్స్ కౌంటీ ఆల్టడినా ప్రాంతంలో కార్చిచ్చు ధాటికి దగ్ధమవుతున్న ఓ ఇల్లు

అమెరికాలో కార్చిచ్చు బీభత్సం

లాస్‌ఏంజెల్స్‌లో వేలాది సంపన్నుల నివాసాలు బుగ్గి.. బాధితుల్లో హాలీవుడ్ నటులు.. 30 వేల మంది తరలింపు

లాస్‌ఏంజెల్స్: సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెల్స్‌ను కార్చిచ్చు వణికించింది. బిలియనీర్లు నివసించే పసిఫిక్ పాలిసేడ్స్‌తో పాటు పలు చోట్ల మంగళ, బుధవారాల్లో కార్చిచ్చు బీభత్సం సృష్టించింది. ఈ కార్చిచ్చు బారిన పడి ఇద్దరు మృతి చెందగా, చాలా మంది గాయపడ్డారు. 3 వేలకు పైగా విస్తీర్ణంలో ఉన్న 10 వేలకు పైగా ఇండ్లు మంటల్లో చిక్కుకోగా అందులో వెయ్యికి పైగా గృహాలు ధ్వంసమయ్యాయి. 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు లాస్ ఏంజెల్స్ కౌంటీ ఫైర్ చీఫ్ ఆంటోని మార్రోన్ తెలిపారు. మెట్రోపాలిటన్‌లో మూడు వేర్వేరు ప్రాంతాలు మంటల్లో చిక్కుకున్నాయన్నారు. వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లతో సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ ప్రమాదంలో శాంటామోనికా ప్రాంతంలో ఖరీదైన ఇళ్లు మంటల్లో చిక్కుకుని బూడిదయ్యాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ఖరీదైన ఇళ్లు, కార్లు, విలువైన సామగ్రి మంటల్లో కాలిబూడిదయ్యాయి. చాలా మంది తమ సామాన్లు, కార్లను ఇళ్లలోనే వదిలేసి బతుకుజీవుడా అంటూ బయటపడ్డారు. ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయిన వారిలో పలువురు బిలియనీర్లతో పాటు హాలీవుడ్ సెలబ్రిటీ జేమ్స్ ఉడ్స్, స్టీవ్ గుటెన్‌బర్గ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.

కట్టుబట్టలతో కాలినడకన..

వేలాదిమంది బాధితులు తమ ఇళ్లలో నుంచి కట్టుబట్టలతో బయటపడిన దృశ్యాలు ఈ ప్రమాదం సందర్భంగా చోటుచేసుకున్నాయి. కళ్లముందే తమ గృహాలు కాలి భస్మీపటలం కావడాన్ని పలువురు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. ఇళ్ల ముందే వందలాది ఖరీదైన కార్లు కాలిబూడిదగా మారాయి. కొంతమంది కార్లలోంచి బయటకు వచ్చినా ట్రాఫిక్ జామ్‌లో ముందుకు వెళ్లలేక వాటిని అక్కడే వదిలేసి కాలినడకన సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడం కన్పించింది. 'ఎన్ని కోట్లున్నా ప్రకృతి వైపరీత్యం ముందు అందరూ తలొంచాల్సిందే' అని పలు వార్తా సంస్థలు ప్రత్యేక కథనాల్లో వివరించాయి. మొత్తం 2,921 ఎకరాలు ఉన్న ప్రాంతం కార్చిచ్చుకు గురైనట్టు స్థానిక వార్తా సంస్థ తెలిపింది. విపత్తు రక్షక దళాలు ప్రమాద స్థలికి చేరుకోవడానికి వీలుగా దారికి అడ్డుగా ఉన్న వాహనాలను తొలగిస్తున్నారు.

భయపెట్టిన దృశ్యాలు..

ఆ ప్రాంతంలో ఉన్న వృద్ధుల సంరక్షణ కేంద్రం కూడా మంటల బారిన పడింది. దీంతో అందులో ఉన్న డజన్ల సంఖ్యలోని వృద్ధులను వీల్‌చైర్లు, హాస్పిటల్ బెడ్స్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ అగ్నికీలలు చుట్టుముట్టగా, ఒక ఇంటిలో ఇద్దరు వ్యక్తులు ఒక పెంపుడు కుక్క చిక్కుకుపోయిన వీడియో భీతిగొలుపుతున్నది. కాగా, గవర్నర్ గవిన్ న్యూసమ్ రాష్ట్రంలో అత్యవసర స్థితిని ప్రకటించారు. . బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

పాసడినా ప్రాంతంలో సంరక్షణ కేంద్రంలోని వృద్ధులను తరలిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత వైద్యం

- రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- మార్చి నుంచి కొత్త పథకం అమలు
- ప్రకటించిన కేంద్రమంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్టు కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు నగదురహిత ఉచిత వైద్యాన్ని అందించనున్నట్టు చెప్పారు. ప్రమాద సమాచారాన్ని 24 గంటల్లో పోలీసులకు అందిస్తే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని మార్చి నుంచి దేశమంతా విస్తరించనున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ఇప్పుడు ఇస్తున్న రూ.5000 సాయాన్ని పెంచనున్నట్టు చెప్పారు. బుధవారం అన్ని రాష్ట్రాల రవాణా శాఖ కార్యదర్శులు, కమిషనర్లతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. ట్రక్కుల వల్ల 2022లో జరిగిన ప్రమాదాల్లో 33 వేల మంది మరణించినట్టు చెప్పారు. డ్రైవర్లు నిద్రలోకి జారుకున్నప్పుడు అప్రమత్తం చేసే ఆడియో వార్నింగ్ వ్యవస్థను కొత్త బస్సులు, ట్రక్కుల్లో తప్పనిసరి చేయనున్నట్టు తెలిపారు. స్టీరింగ్‌ను అతిగా లేదా తక్కువ తిప్పినప్పుడు యాక్టివేట్ అయ్యే ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్‌ను సైతం తీసుకురానున్నట్టు వివరించారు. వాణిజ్య వాహనాలపై డ్రైవర్లు రోజులో ఎనిమిది గంటల కంటే ఎక్కువ పని చేయకుండా నియంత్రించేందుకు ఆధార్ ఆధారిత సాంకేతిక వ్యవస్థను తీసుకువచ్చే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. దేశంలో నిపుణులైన డ్రైవర్ల కొరత ఉందని, డ్రైవర్ల కొరత తీర్చేందుకు 1,250 కొత్త డ్రైవింగ్ స్కూళ్లను తెరవనున్నట్టు చెప్పారు.

మహిళ శరీర ఆకృతిపై వ్యాఖ్యలు

లైంగిక వేధింపులే

కేరళ హైకోర్టు

కొచ్చి: మహిళ శరీర ఆకృతిపై చేసే వ్యాఖ్య లైంగిక పరమైనదేనని, ఇది శిక్షించదగిన లైంగిక వేధింపుల నేరం అవుతుందని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. అందమైన శరీర ఆకృతిపై యథాలాపంగా చేసే వ్యాఖ్యలను లైంగిక వేధింపులుగా పరిగణించరాదని కేరళ రాష్ట్ర విద్యుత్తు బోర్డు మాజీ ఉద్యోగి దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 6న తోసిపుచ్చింది. ఇదే సంస్థలో పని చేస్తున్న ఓ మహిళ ఆయనపై ఫిర్యాదు చేశారు. అభ్యంతకరమైన సందేశాలు పంపేవాడని, వీడియో కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించారు. కేఎస్ఈబీ, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన ఈ దుష్ప్రవర్తనను కొనసాగించాడని తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా బాధితురాలిపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని ఆయన కోరారు. అయితే, ప్రాసిక్యూషన్, బాధితురాలు వాదనలు వినిపించింది. తనను అతను వేధించాడని తెలిపింది. వీరి వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. పిటిషనర్‌కు గతంలో ఇచ్చిన తాత్కాలిక ఉపశమనాన్ని ఉపసంహరించింది.

ఆ నిందితుడు డీఎంకే సానుభూతిపరుడే

- అయినా వదిలిపెట్టం
- అన్నా వర్సిటీ కేసుపై స్టాలిన్

చెన్నై, జనవరి 8: అన్నా వర్సిటీలో జరిగిన లైంగిక దాడి కేసు నిందితుడు డీఎంకే సానుభూతిపరుడేనని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం అసెంబ్లీలో అంగీకరించారు. అయితే అతను తమ పార్టీలో సభ్యుడు కాడని, అతడికి తాము ఎలాంటి రక్షణ కల్పించడం లేదని స్పష్టం చేశారు. అతను డీఎంకే సభ్యుడైనా తాను చర్యలు తీసుకుని ఉండేవాడినని ప్రకటించారు. నిందితుడిని కాపాడి ఉండేవారం కాదని, వెంటనే అరెస్టు చేసి, గూండా చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించి ఉండేవారమని ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరిగేలా చూడటమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలయ్యేలా చూస్తామని, వేగంగా విచారణ జరిపించి నిందితుడికి గరిష్ఠంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్టాలిన్ ప్రకటించారు.

తెలంగాణలో 2,500 ఇస్తున్నం!

- నెలకు 90 లక్షల మంది మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నం
- జాతీయ మీడియాతో కాంగ్రెస్ నేత సుప్రియా అబద్ధాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఒక్కో ఆడబిడ్డ బ్యాంకు ఖాతాలో నెలకు రూ. 2,500 చొప్పున జమ అవుతుందట. 'మహాలక్ష్మి పథకం' కింద రేవంత్ ప్రభుత్వమే ఈ ఆర్థిక సాయం చేస్తుందట. ఏమిటీ ఆశ్చర్యంగా ఉందా? మా అకౌంట్‌లో డబ్బు ఎప్పుడు జమైందంటూ షాక్ అవుతున్నారా?? మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ కానప్పటికీ.. దేశం మొత్తం మాత్రం మనకు కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు వేస్తుందనే అనుకొంటున్నది. ఎందుకంటే జాతీయ మీడియా 'ఆజ్‌తక్'లో నిర్వహించిన ఓ చర్చా వేదికలో కాంగ్రెస్ ఐటీసెల్ హెడ్ సుప్రియా శ్రీనేత్ ఇవే అబద్ధాలను వల్లె వేశారు మరి.

అసలేం జరిగిందంటే?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ క్రమంలో అక్కడ అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలాగానే అలవిగాని హామీలను కురిపించింది. తాము అధికారంలోకి వస్తే 'ప్యారీదీదీ యోజన' పేరిట ఢిల్లీ మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. దీంతో ఈ స్కీమ్‌ను ఎలా అమలు చేయగలరని చర్చలో భాగంగా న్యూస్ యాంకర్ ప్రశ్నించారు. దీనిపై సుప్రియా స్పందిస్తూ.. 'కర్ణాటకలోని 1.28 కోట్ల మంది మహిళలకు నెలకు రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నాం. అధికారంలోకి రాగానే ఈ స్కీమ్‌ను ప్రారంభించాం' అని చెప్పారు. కాగా, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 చొప్పున ఇస్తామన్న ఆర్థిక సాయాన్ని ఒక్క ఇన్‌స్టాల్‌మెంట్ కూడా జమ చేయలేదు. అంతేకాదు మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క గ్యారెంటీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు ఇలా అబద్ధాలు వల్లెవేయడంపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఆర్గానిక్ వాటర్ బాటిల్స్

- త్వరలో ఆవిష్కరించనున్న కేరళ స్టార్టప్
- బయోడీగ్రేడబుల్ పదార్థాలతో తయారీ

తిరువనంతపురం: కేరళ సాగునీటి మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలోని 'గ్రీన్ బయో ప్రొడక్ట్స్' స్టార్టప్ కంపెనీ త్వరలో పర్యావరణ హితమైన ఆర్గానిక్ వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. 'కంపోస్టబుల్ బాటిల్స్' అని కూడా పిలిచే వీటిని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరికొద్ది రోజుల్లో ఆవిష్కరించనున్నారు. పూర్తిగా నేలలో కలిసిపోయే బయోడీగ్రేడబుల్ పదార్థాలతో వీటిని తయారు చేయనున్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా తీసుకురానున్న వీటిని 'హిల్లీ ఆక్వా' బ్రాండ్ పేరుతో మార్కెట్లో ప్రవేశపెట్టనున్నారు. గ్రీన్ బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఐదేండ్ల క్రితం ముంబై ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఓ ప్రొటోటైప్ కేరళ జలవనరుల శాఖ మంత్రి రోషీ అగస్టీన్‌ను ఆకట్టుకోవడంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. కంపోస్టబుల్ వాటర్ బాటిళ్ల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను గ్రీన్ బయో ప్రొడక్ట్స్ సంస్థ సరఫరా చేయనుండగా ఆ బాటిల్స్‌ను కేఐఐడీసీ తయారు చేయనున్నది. ఇది కార్యరూపం దాల్చితే దేశంలో పర్యావరణ హితమైన వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా కేరళ నిలువనున్నది.

పోలీసులను తప్పుదారి పట్టించిన గూగుల్ మ్యాప్స్!

- నాగాలాండ్‌లో తేలిన అస్సాం పోలీసులు
- స్థానికుల దాడి.. రాత్రంతా బందీలుగా

గువాహటి, జనవరి 8: నిందితుడిని పట్టుకునేందుకు గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకున్న పోలీసులు పక్క రాష్ట్రంలోకి వెళ్లి అక్కడి స్థానికులకు బందీలుగా మారారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఓ నిందితుడి కోసం గాలింపు మొదలుపెట్టిన అస్సాం పోలీసులకు చెందిన 16 మంది సభ్యుల బృందం గూగుల్ మ్యాప్స్ చూపించిన మార్గంలో ప్రయాణించి చివరకు నాగాలాండ్‌లో తేలింది. అది అస్సాంలోని తేయాకు తోటగా గూగుల్ మ్యాప్స్ చూపించిందని, వాస్తవానికి అది నాగాలాండ్‌గా తేలిందని అస్సాం పోలీసుకు చెందిన ఓ సీనియర్ అధికారి చెప్పారు. వీరి వద్ద ఉన్న అధునాతన ఆయుధాలు చూసిన స్థానికులు దుండగులుగా అనుమానించి బంధించారని ఆయన చెప్పారు. పైగా వీరిలో ముగ్గురు మాత్రమే యూనిఫాంలో ఉండగా మిగిలిన వారంతా సివిల్ డ్రెస్‌లో ఉన్నారని ఆయన తెలిపారు. స్థానికుల దాడిలో తమ బృందం సభ్యుడు ఒకరికి గాయమైందని అధికారి చెప్పారు. సమాచారం అందుకున్న జోర్హాట్ ఎస్పీ అస్సాం పోలీసులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. అస్సాం పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. వీరంతా నిజమైన పోలీసులే అని నిర్ధారించుకున్న స్థానికులు రాత్రి ఐదుగురిని విడిచిపెట్టి, మిగిలిన 11 మందిని ఉదయం వదిలిపెట్టారని ఆ అధికారి చెప్పారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

- జేపీసీలో విపక్ష ఎంపీలు
- సమర్థించుకున్న బీజేపీ

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలపై తీసుకువచ్చిన రెండు బిల్లులపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ మొదటి సమావేశం అధికార, విపక్ష నేతల వాదోపవాదాలతో దద్దరిల్లింది. జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగం, సమాఖ్యవాద ప్రాథమిక నిర్మాణంపై దాడిగా విపక్ష ఎంపీలు వర్ణించగా, ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేదిగా ఉందని బీజేపీ ఎంపీలు సమర్థించారు. 39 మందితో ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ తొలి సమావేశంలో బిల్లు ఉద్దేశాలు, లక్ష్యాలు, అందులో పొందుపరిచిన అంశాలను న్యాయ శాఖ తొలుత వివరించింది. ఈ సందర్భంగా పలువురు విపక్ష ఎంపీలు జమిలి ఎన్నికల కారణంగా ఖర్చు తగ్గుతుందన్న కేంద్రం వాదనను నిలదీశారు. అసలు ఒకే ఎన్నిక విధానం అన్న మాటే రాజ్యాంగ విరుద్ధమని, సమాఖ్యవాద ప్రాథమిక నిర్మాణంపై దాడి అని కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ ఎంపీలు విమర్శించారు.

ఇస్రో 'స్పేడెక్స్' మళ్లీ వాయిదా

ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ మరింత ఆలస్యం

బెంగళూరు, జనవరి 8: ఇస్రో చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్(స్పేడెక్స్)కు అవాంతరాలు ఎదురవుతున్నాయి. గురువారం అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం(డాకింగ్) చేయాలని ఇస్రో భావించింది. ఇందుకోసం రెండు ఉపగ్రహాలను 225 మీటర్ల సమీపానికి తెచ్చినప్పుడు వాటి దిశ ఊహించిన దాని కంటే కొంత తేడాగా ఉండటంతో డాకింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్టు ఇస్రో బుధవారం 'ఎక్స్'లో ప్రకటించింది. ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. డాకింగ్ ప్రక్రియ వాయిదా పడటం ఇది రెండోసారి. మంగళవారం జరగాల్సి ఉన్న ఈ ప్రక్రియ గురువారానికి వాయిదా పడింది. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసే సామర్థ్యాన్ని అందుకునేందుకు ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా స్పేడెక్స్ ప్రయోగం చేపట్టిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్ వెంట ఇండియా కూటమి

ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరైన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా మిగిలింది. 2024 లోక్ సభ ఎన్నికల కోసం జట్టుకట్టిన ఇండియా కూటమి పార్టీలు ప్రస్తుతం కాంగ్రెస్‌ను పట్టించుకోవడం లేదు. టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) వంటి ప్రధాన పార్టీలు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తున్నది. ఆప్ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఎక్స్ వేదికగా తెలిపిన సమాచారం ప్రకారం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ ఢిల్లీ శాసన సభ ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ప్రకటించారు. తమకు మద్దతిచ్చినందుకు మమతకు కేజ్రీవాల్ ధన్యవాదాలు తెలిపారు. కష్టసుఖాల్లో అండగా ఉంటూ, ఆశీర్వదిస్తున్నందుకు మమత దీదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఇటీవల ఆరోపణలు చేయడంతో, ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని ఆప్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇదిలావుండగా, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో కేజ్రీవాల్ మంతనాలు జరుపుతున్నట్లు, ఉద్ధవ్ మరికొద్ది రోజుల్లో ఢిల్లీలో ఆప్ తరపున ప్రచారం చేయబోతున్నట్లు సమాచారం. 70 స్థానాలున్న ఢిల్లీ శాసన సభ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల 5న, ఓట్ల లెక్కింపు వచ్చే నెల 8న జరుగుతాయి.

అరకు సందర్శనకు 25 మంది

సుప్రీంకోర్టు జడ్జిలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులోని 25 మంది జడ్జిలు, వారి సతీమణులు ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖపట్నం, అరకు అందాలను ఆస్వాదించబోతున్నారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన వీకెండ్ రిట్రీట్‌లో వీరు పాల్గొంటున్నారు. సంక్లిష్టమైన న్యాయస్థానాల వాతావరణం నుంచి కాస్త ఉపశమనం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటన అని సీజేఐకి సన్నిహిత వర్గాలు చెప్పాయి. ఈ కార్యక్రమంలో జడ్జిల ప